"అయితే ఇక్కడే కూర్చోండి. ఇప్పుడే వస్తాను" మాటతోపాటు ఊళ్ళోకి పరుగుతీసింది లక్ష్మి.

అయిదు నిమిషాల తర్వాత రొప్పుతూ, చేతిలో ఏదో సీసాతో వచ్చింది.

నేరుగా గర్భగుడిలోకి అడుగుపెట్టింది

ప్రమిదలోని నూనెను కింద పారబోసి, వత్తుల్ని సరిచేసి, తన చేతిలో సీసాలోని అయిల్ని ప్రమిదలో వేసి, వత్తుల్ని ఎగదోసి, సుబ్బారెడ్డి దగ్గరకొచ్చి, అగ్గిపెట్టె తీసుకొని వెలిగించింది.

గాలి రివ్వుమని వీస్తోంది.

అగ్గిపుల్ల వెలిగిస్తున్న లక్ష్మి వైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు ఇద్దరూ.

అగ్గిపుల్లతో వత్తుల్ని వెలిగించింది.

వత్తులు నెమ్మదిగా అంటుకున్నాయి. రాజుకున్నాయి. వత్తులు వెలుగుతున్నాయి.

గాలి వీస్తూనే వుంది.

దీపం వెలుగుతూనే వుంది.

సుబ్బారెడ్డి గబుక్కున లేచి, ముందుకెళ్ళాడు. అనసూయమ్మకు కూడా ఈ దృశ్యం వింతగా వుంది.

"ఏమిటే! ఏమిటి........వేసావే ఆ ప్రమిదలో?" కాంతివైపు సంతోషంగా చూస్తూ అడిగింది అనసూయమ్మ.

"ముందు పందెం డబ్బులివ్వండి......తర్వాత చెప్తాను" సుబ్బారెడ్డి పెదవుల మీద చిరునవ్వు కదలాడింది ఆ మాటకు

"ఇస్తాను.........ఈ డబ్బుతో ఏం కొనుక్కుంటావ్?" జేబులో చెయ్యి పెడుతూ అడిగారాయన

జవాబు చెప్పడానికి తటపటాయించింది లక్ష్మి

నెమ్మదిగా ఆమె పెదవులు విచ్చుకున్నాయి

"బియ్యం అయ్యి, నాలుగురోజులైంది పట్నానికెళ్ళి ఇవాళ కూడారాలేదు......" బితుకు బితుకుగా చెప్పింది లక్ష్మి.

"అంటే .....నాలుగు రోజుల్నుంచి నువ్వు........" ఎండిపోయిన గొంతుతో అడిగాడు సుబ్బారెడ్డి.

"చెరువు నీళ్ళు.......తాగుతున్నగా......."

"ఏదో అదృశ్య హస్తం చెంపమీద పటేల్మని కొట్టినట్టయింది సుబ్బారెడ్డికి

ఆకలిని కూడా ఎలా మాయతో, మోసం చేయొచ్చో తెల్సుకున్న పసితనం........

గబుక్కున జేబులోంచి పది రూపాయల్ని తీసి లక్ష్మి చేతిలో పెట్టాడు సుబ్బారెడ్డి

"ఇవాళ మా ఇంటికొచ్చి తిను. రేపు యీ డబ్బుతో బియ్యం కొనుక్కో" చెప్పాడాయన

"ఎందుకు? నాకు వంటచేసుకోవడం వచ్చుగదా" దీపం వెలుతురులో ఆ పది రూపాయల వైపు సంతోషంగా చూస్తూ అంది లక్ష్మి.

లక్ష్మి మెరుస్తున్న ముఖాన్ని చూస్తున్నాడు సుబ్బారెడ్డి

"అవునే లక్ష్మీ......ఇంతకీ.....ప్రమిదలో ఏం వేశావ్" అనసూయమ్మ దృష్టి వెలుగుతున్న దీపం మీదే వుంది

"ఏం వేశానో మీరే తెల్సుకోండి" తుర్రుమని పరిగెడుతూ అరిచింది లక్ష్మి.

"లక్ష్మీ" కంగారుగా పిలిచాడు సుబ్బారెడ్డి. చటుక్కున ఆగిపోయింది లక్ష్మి.

ఆ ప్రమిదలో ఏం వేసిందో, ఏం వేస్తే, గాలి వీస్తున్న ఆ దీపం ఆరలేదే, ఆరదో అనుభవజ్ఞుడైన సుబ్బారెడ్డికి తెలుసు.

తనకు అవసరమైన పది రూపాయలకోసం ఎందుకూ పనికిరాదను కున్న పదహారేళ్ళ పల్లెటూరి అమ్మాయి తను గెలవడం కోసం పందెం. కట్టి గాల్లో దీపాన్ని వెలిగించడం విచిత్రంగా
వుంది సుబ్బారెడ్డికి.

ఎలిమెంటరీ స్కూల్ లెక్కల మాస్టారు తనెదురుగా నిల్చున్న అమ్మాయి జీవితాన్ని కాలిక్యులేట్ చేస్తున్నాడు.

ఎవరూ గమనించని విషయాన్ని ఆ అమ్మాయి గమనించడం ఆయన ఆశ్చర్యానికి కారణం.

"నీకు యీ కండువా కూడా యిస్తానన్నాను గదా! తీసుకో తన ఎడమ భుజమ్మీద జరీ అంచు కండువాని తీసి విప్పి ఆమె భుజాల నిండుగా కప్పాడు సుబ్బారెడ్డి

ఇప్పుడు అతడికెందుకో సంతోషంగా వుంది.

"లక్ష్మీ!" నీకు భగవంతుడు తెలివితేటలిచ్చాడే.....వాటిని దాచుకోకు. కానీ వంటిని దాచుకోవాలమ్మా.....మీ నాన్నని పైటని కొనమని చెప్పు. అంతవరకూ దీన్ని కప్పుకొని తిరుగు"
ప్రేమగా చెప్పాడాయన ఆంతకంటే స్పష్టంగా మరి చెప్పలేక పోయాడాయన.

లక్ష్మి భుజాల చుట్టూ కండువా పెచ్చగా వుంది ఆ వెచ్చదనం ఆమెకు సంతోషంగా వుంది.

మరేం మాట్లాడకుండా ముందుకుపరుగెత్తింది లక్ష్మి.

"ఇంతకీ ఆ పిల్ల ఆ ప్రమిదలో ఏం వేసిందండీ" ఇంటికొస్తున్న దార్లో అనసూయమ్మ

మూడోసారి అనసూయమ్మ ప్రశ్నను వినిపించుకున్నాడు సుబ్బారెడ్డి.

"మొద్దూ......ఇప్పటికీ తెలీలేదా? నీకు వారం రోజులు టైమిస్తున్నాను తెలుసుకుని చెప్పు .......కరెక్టుగా జవాబు చెప్పావనుకో.......పట్టుచీర కొంటాను."

తనకు తెలీకుండానే పందెం కట్టాడు సుబ్బారెడ్డి.

"పట్టుచీర కొంటారా?" విస్తుపోతూ అందావిడి.

ఒక విత్తనం ఎంతటి మహావృక్షమవుతుందో, ఆ విత్తు నాటిన వాడికి తెలుసు.

ఒక వ్యక్తి!

ఈ పిల్ల మామూలు ఆడపిల్ల కాదు సమ్‌థింగ్‌రేర్.

సుబ్బారెడ్డి బ్రెయిన్ లక్ష్మి గురించే ఆలోచిస్తోంది.

అప్పుడు సరిగ్గా-

రాత్రి తొమ్మిదిగంటలు దాటింది.

సరిగ్గా అదే సమయానికి-

ఆ కుగ్రామానికి కొన్ని వేల మైళ్ళ దూరంలో వున్న స్పెయిన్‌లో......

* * * * * * * *

మర్బెల్లా టౌన్‌లో-

తన లీజర్ రిసార్ట్ ఎదుట, స్విమ్మింగ్‌పూల్ ప్రక్కన, కుషన్ ఛైర్‌లో కూర్చున్న శుక్రవర్ణ మహంత.

తన అసిస్టెంట్ రాబర్ట్ మర్చంట్ వైపు కంగారుగా చూశాడు

"వేరీజ్ హి నౌ......."

మార్బెల్లా టౌన్........"

మార్బెల్లా టౌన్, ఇంటెలిజెన్స్ చీఫ్ నికొలస్, ఆ బర్త్‌డే పార్టీకి వచ్చిన రాయల్ గెస్టులు ఎక్కడ తిరిగారో, ఎవర్ని కలుసుకున్నారో ఏం మాట్లాడుకున్నారో వాళ్ళకు తెలీయకుండా రహస్యంగా తీసిన వీడియో కేసెట్ డిస్కుల్ని ఒక్కటొక్కటీ అందిస్తున్నాడు.

పక్కనున్న పోర్టబుల్ టీవికి వున్న బాక్స్‌లో ఆ డిస్కుల్ని ఇన్‌సర్ట్ చేస్తున్నాడు రాబర్ట్ మర్చంట్.

తనకు కావల్సింది, అవసరమైంది కృపానంద దేశ్‌ముఖ్ గురించి.

"ఐవాంట్ దేశ్‌ముఖ్ డిటెల్స్......"

" ఆ కేసెట్స్ మామూలు సినిమా కేసెట్స్‌లా లేవు. స్పెషల్ డిస్క్స్ అవి.

కేరమ్ బోర్డు స్టయికర్ అంత మందంలో వున్నాయి ఆ డిస్కులు.

గబగబా ఆ డిస్కుల్లోంచి ఓ డిస్కుని తీసి అందించాడు నికొలస్.

మహంత.

కృపానంద దేశ్‌ముఖ్.........

తనకు కేటాయించిన గెస్ట్‌హౌస్‌లో, లివింగ్ రూమ్‌లో కాసేపు రెస్టు తీసుకోవడం, వెంటనే లేచి బార్ రూమ్ వేపు నడవడం, ఆ రూంలో తన పిఏ తో మాట్లాడటం, ఆ తర్వాత-

ఆ రూమ్‌లోంచి బయటకు రావడం-

అంతే.......

వీడియో డిస్క్‌లో అంతవరకూ రికార్డయింది. అంటే....అంటే.........మహంత తలెత్తి రాబర్టు మర్చంట్ వేర్పు సీరియస్ చూశాడు.

"మిస్టర్ మర్చంట్! డోంట్ ఆండర్ ఎస్టిమేట్ హిమ్..........! తన కదలికల్మీద నిఘా వుందన్న విషయం తెలుసుకున్న దేశ్‌ముఖ్ వీడియో కెమెరాలైన్‌ని కట్ చేసుంటాడు" సాధ్యమైనంత నెమ్మదిగా అన్నాడు మహంత!

ఆ మాటకు రాబర్టు మర్చంట్ తెల్లమొహం పెట్టాడు.

"మన ఇంటెలిజెన్స్ క్రూ........సిటీని గాలిస్తున్నారు. మిష్టర్ చీఫ్! విత్ ఇన్ ఫ్యూ సెకెండ్స్! ఉయ్ విల్ గెట్ ఇన్ఫర్మేషన్........"

ఆ మాటల్ని వినిపించుకోలేదు మహంత.

అతని మానసంతా ఆందోళనతో నిండిపోయింది.

సరిగ్గా......

అదే సమయంలో........

కార్డ్‌లెస్ టెలిఫోన్ మోగింది.

అతృతంగా అందుకున్నాడు రాబర్టు మర్చంట్.

రెండు నిమిషాల తర్వాత ఫోను ఆఫ్ చేశాడు.

"మిష్టర్ చీఫ్! దేశ్‌ముఖ్ మలయా ఎయిర్‌పోర్టులో వున్నాడు"

మలయా ఎయిర్ పోర్టు శుక్రవర్ణ మహంత, పర్సనల్ ఎయిర్‌పోర్టు. లీజర్ ఆవర్ రిసార్టుకి అది అయిదు కిలోమీటర్లు దూరంలో వుంది.

తన పుట్టనరోజు ఫంక్షన్‌కి వచ్చిన రాయల్ గెస్టుల్లో ఏ ఒక్క గెస్టుకీ ఆ ఎయిర్‌పోర్టుని చూపించలేదు మహంత!

దానిక్కారణం.......

డి.సి. 8 పర్సనల్ ప్లైటు.........దాదాపు ముప్పై ఒక్క అమెరికన్

మిలియన్ డాలర్ల ఖర్చుతో డిసి8, ప్లైటు తయారుచేయించాడు అతను అతని బిజినెస్ లైఫ్ డిసి8 ఒక డ్రీమ్స్!

గోల్డ్ ప్లేటెడ్ ఫాసెట్సు, గోల్డ్ ప్లేటెడ్ సీటు బెల్టులు, స్పెషల్ బెడ్‌రూమ్, షాండిలీర్స్, స్పెషల్ బాత్రూమ్, మీటింగ్ రూమ్స్, కంప్లీట్ కిచెన్. గోల్డ్ సిల్వర్ ప్లేటెడ్ కిచెన్ వేర్.........

అతను నిర్మించుకున్న ఆకాశంలో స్వర్ణ భవనం డిసి8.......డిసి8 నేలమీద చూసినవాడెవడైనా, ఏ జైపూర్ కోటలోంచో ఒక ప్యాలెస్ పార్టుని తీసి విమానంగా మార్చినట్టు వుంటుంది. ఆ ఫ్లైట్......

ఆ ఫ్లైటు ప్రత్యేకతలు.......ఒకసారి నింపిన ఇంధనంతో, దాదాపు పదిహేను గంటలసేపు నిరాఘాటంగా ప్రయాణం చెయ్యొచ్చు అలాగే ఆ ఫ్లైట్లోని మహంత బెడ్‌రూమ్ నుంచి ప్రపంచంలోఏ ప్రాంతానికయినా ఫోను ద్వారా మాట్లాడగలిగే సదుపాయం ......అలాగే ఎప్పటికప్పుడు ప్రపంచంలో ఏ మారుమూల ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి అవసరమైన శాటిలైట్ స్పెషల్ నెట్ వర్క్ వుంది.

ఇంకో విశేషం.......

ఆ ఫ్లైట్‌లో అమర్చిన ఎలక్ట్రానిక్ మేప్.......ఫ్లైట్ ఆకాశంలో ప్రయాణం చేస్తున్నప్పుడు, విమానం ఏ దేశంలో, ఏ ప్రాంతంలో వుందో ఆ ఎలక్ట్రానిక్ మేప్ స్పష్టంగా తెలియచేస్తుంది.

ఈ విమానం నపడానికి అమెరికా నుంచి ఇద్దరు స్పెషల్ పైలెట్స్‌ని తెప్పించాడతను.

తన ప్రత్యేక రూపకల్పనలో అపురూపంగా తయారయిన ఆ విమానం గురించి అందుకే ఎవరికీ చెప్పలేదతను.

మలయా ఎయిర్‌పోర్టు వేపు ఎవరూ వెళ్ళకుండా అవసరమయిన జాగ్రత్తలన్నీ తీసుకున్నాడతను.

కానీ దేశ్‌ముఖ్ అక్కడికెలా వెళ్ళగలిగాడు?

అసలు దేశ్‌ముఖ్ ఫ్లైటు విషయం ఎలా తెలిసింది? ఎందుకు వెళ్ళాడు?

అసలు దేశ్‌ముఖ్ ఇక్కడికెందుకొచ్చాడు?

సరిగ్గా పది నిమిషాలు గడిచాయి,

మలయా ఎయిర్‌పోర్టులో డి.సి.8 ఫ్లైట్లో వున్నాడు మహంత.

విశాలమైన ఫ్లైట్‌లో ఒక్కడే తిరుగుతున్న దేశ్‌ముఖ్‌ని చూసి ఆశ్చర్యపోయాడు మహంత.

"దిసిజ్ మై డ్రీమ్! మీరు చూస్తానంటే నేనే స్వయంగా మిమ్మల్ని తీసికొచ్చి చూపించేవాడ్ని" ఎలా అనాలో తెలీక అన్నాడు మహంత.

"ఇండియాలోని తాజ్‌మహల్లా వుంది. దిసిజ్ ఫ్లయింగ్ మాన్యుమెంట్.....యామై కరెక్ట్?" పొగిడాడు దేశ్‌ముఖ్.

ఈ ఫ్లైట్‌లో పైలెట్స్ క్కూడా తెలీని సీక్రెట్స్ కొన్ని వున్నాయి. వాటిని వూహించి తెలుసుకోడానికి వచ్చాడా దేశ్‌ముఖ్.

ముఖం ప్రసన్నంగా ఉన్నా, మనసు సీరియస్‌గా ఉంది మహంతకు.

స్పెషల్ పర్సనల్ బార్ రూమ్‌లోకి అడుగుపెట్టాడు మహంత.

"కమాన్ సాచ్! లెటజ్ హేవ్ ఫన్" బటన్ నొక్కాడతను.

రెండు అందమైన, నాజూకయిన గ్లాసులు టేబుల్ కిందనుంచి పైకొచ్చాయి.......

ఆ రెండు గ్లాసులనిండా డ్రింక్.

పారిస్ మేడ్ ఫ్రూట్ మిక్చర్ జిన్.

"ఇంకా అరవై నిమిషాలు మాత్రమే టైముంది" సీట్లో రిలాక్స్ అవుతూ గ్లాస్‌ని చేతిలోకి తీసుకుంటూ అన్నాడు దేశ్‌ముఖ్.

"దేనికీ?" అడిగాడు మహంత.

"మరీ ఎక్కువగా ఆలోచించకు........వర్రీలో పడతావ్ బొంబాయిలో బిజినెస్ కాన్ఫరెన్స్ వుంది..........వెళ్ళాలి" డ్రింక్‌ని సిప్‌చేస్తూ చెప్పాడు దేశ్‌ముఖ్.

"నా డి.సి 8 ఫ్లయిట్‌లో సరిగ్గా గంట తర్వాత మీరు బయల్దేరితే సరిగ్గా ఐదు గంటల తర్వాత మీరు బొంబాయి వుంటాయి" తన ఫ్లయిట్ స్పెషాలిటీని గర్వంగా చెప్పాడు మహంత. (ఇలాంటి అద్భుతమయిన ఫ్లయిట్ అద్నాన్ ఖషోగీకి వుంది)

పెదవులతోనే నవ్వాడు దేశ్‌ముఖ్